కళాకారులను ప్రోత్సహించాలి


అవార్డును ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

గన్‌ఫౌండ్రీ: సమాజానికి ఉపయోగపడే మంచి కార్యక్రమాలు చేస్తున్న కళాకారులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం రవీంద్రభారతిలో స్వాతి ఆర్ట్ క్రియేషన్ 29వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు బుల్లితెర నటులకు గోల్డెన్ స్క్రీన్ టీవీ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..30 ఏళ్లుగా అనేక మంది నిరుపేద కళాకారులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్న సంస్థ ప్రతినిధులను అభినందించారు. అనంతరం 11 మంది వికలాంగులకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. అంతకు ముందు కళాకారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విశ్రాంత డీజీపీ గోపీనాథ్‌రెడ్డి, తెలుగు టీవీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల సురేష్‌కుమార్, నిర్మాత బీఎస్.రెడ్డి, మా సభ్యులు నాగులవల్లి పద్మిని, తుమ్మపల్లి రామసత్య నారాయణ, అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కెవై.గిరిరాజు పాల్గొన్నారు.

'ఏడాది కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం'


వేడుకల్లో ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్ సమీనా బేగం

యాకుత్‌పురా: ఏడాది కాలంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం తలాబ్‌చంచలం కార్పొరేటర్ సమీనా బేగం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్ని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయనను నాయకులు, స్థానిక ప్రజలు సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రాబోయో రోజుల్లో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించి రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ సభ్యత్వాన్ని తొలగించాలి


మాట్లాడుతున్న చొక్కారావు

సుల్తాన్‌బజార్: వెలమ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ శాసన సభ సభ్యత్వాన్ని తొలగించాలని అంధుల అభివృద్ధి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పి.చొక్కారావు డిమాండ్ చేశారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ఎమ్మెల్యే ఓ కులాన్ని దూషించడం సభ్యతం కాదన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక కులాన్ని తిట్టడం సిగ్గుచేటన్నారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు సభ్యత సంస్కారం నేర్చుకోవాలని సూచించారు. ఈ విషయమై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. సాధారణ ప్రజలు మాట్లాడితే కేసులు పెట్టే చట్టం ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేస్తే కేసులు పెట్టరా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

లారీ అసోసియేషన్ వారికి అండగా ఉంటాం



గోల్కొండ: తెలంగాణలో లారీల యజమానులు ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొంటున్నారని వారికి ఐఎన్‌టీయూసీ అండగా ఉంటుందని జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి అన్నారు. తెలంగాణ లారీ అసోసియేషన్ వారు రవీంద్రభారతీలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న కష్టాలను ఆయన ముందు ఉంచారు. లారీలు సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయని ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ తాము లారీలను నడుపుతున్నామని తెలంగాణ రాష్ట్ర లారీ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి ఆయనకు వివరించారు. సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని ఈ సందర్భంగా సంజీవరెడ్డి హామీ ఇచ్చారు. ఆయనను కలిసిన వారిలో లారీ అసోసియేషన్ ప్రతినిధులు వెంకటరెడ్డి, కురాకుల కృష్ణ, మల్‌రెడ్డి తదితరులున్నారు.

పుస్తక పఠనాన్ని పెంపొందించాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏవీ రంగనాథ్, చిత్రంలో పి.విజయబాబు, రామ్ సత్యవోలు

నాంపల్లి: పుస్తక పఠనాన్ని పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. శనివారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్ సురానా ఆడిటోరియంలో రామ్ సత్యవోలు రచించిన 'హాఫ్ ట్రూత్'(అర్థసత్యం) పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షుడు పి.విజయబాబు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. పోలీసు కథనాన్ని ఇతివృత్తంగా తీసుకుని రామ్ సత్యవోలు రచనలు చేయడం ఆసక్తిని కలిగించిందని అన్నారు. డబుల్ మర్డర్ అంశాన్ని పరిశోధించి తనదైన శైలిలో రచనలు చేశారని అన్నారు. పి.విజయబాబు మాట్లాడుతూ..పుస్తక పఠనం, ప్రచురణ క్రమంగా కుంటుపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. హాస్య బ్రహ్మ శంకర నారాయణ, సీనియర్ జర్నలిస్టులు తాడి ప్రకాష్, పి.వి.రామ్మోహన్ నాయుడు, గోవిందరాజ చక్రధర్, సుప్రసిద్ధ రచయిత్రి మానస ఎండ్లూరి, అరుణ గోగులమండ, రచయిత సౌభాగ్య విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వారిపై చర్యలు తీసుకోవాలి


ఫిర్యాదు చేస్తున్న కైలాష్ సజ్జన్, జంగా శ్రీనివాసరావు

సుల్తాన్‌బజార్: రాజకీయ లబ్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఆయన భార్య, కుమార్తె ఫొటోలను జత చేస్తూ తెలంగాణ తల్లి విగ్రహం మీద అసభ్య పద జాలంతో, సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్న జర్నలిస్టు శంకర్, బిగ్ టీవీ సోషల్ మీడియా ఛానల్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సోషల్ మీడియా టీపీసీసీ స్టేట్ సెక్రటరీలు కైలాష్ సజ్జన్, జంగా శ్రీనివాసరావు, హైదరాబాద్ కో ఆర్డినేటర్ వీఎస్.వంశీ బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆర్థిక సాయం

నాంపల్లి: ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న ఇద్దరు కాంట్రాక్ట్ సిబ్బందిని ఆదుకోవడానికి సింగరేణి భవన్ ఉద్యోగులు ముందుకు వచ్చారు. సంస్థలో పనిచేస్తున్న పుష్ప కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. ఆమె కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సాయం, అలాగే సంస్థలో కాంట్రాక్ట్ విభాగంలో పనిచేస్తున్న హబీబ్ అనారోగ్య సమస్యలతో బాధపడుతుండటంతో ఆయనకు రూ.25వేల ఆర్థిక సాయం అందించారు. ఈ ఆర్థిక సహాయం సొమ్మును జనరల్ మేనేజర్ (కో ఆర్డినేషన్) ఎస్‌డీఎం సుభానీ బాధితులకు అందజేశారు. కష్టాల్లో ఉన్న కాంట్రాక్ట్ సిబ్బందిని ఆదుకోవడానికి సింగరేణి భవన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులంతా స్వచ్ఛందంగా ముందుకురావడం అభినందనీయం అన్నారు.



త్వరలోనే అన్ని సౌకర్యాలతో స్పోర్ట్స్ స్టేడియం


బాక్సింగ్ విజేతలతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గానికి త్వరలోనే అన్ని సౌకర్యాలతో కూడిన అత్యాధునిక స్పోర్ట్స్ స్టేడియం నిర్మించడానికి ప్రతిపాదనలు పంపామని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్ స్కూల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలు సాధించిన ఖదీజాబేగం, మాహీంబేగం, షేక్ అబ్దుల్ రహీం, మహ్మద్ రేహాన్‌ను శనివారం ఆయన గోల్కొండలోని ఒవైసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ ఒవైసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలకు అదనంగా మరిన్ని హంగులు పేర్చి అధునాతనంగా తీర్చిదిద్దుతామన్నారు. బాక్సింగ్‌తో పాటు స్విమ్మింగ్, ఫుట్‌బాల్‌లలో కూడా కార్వాన్ నియోజకవర్గం నుంచి ఎందరో యువకులు జాతీయ స్థాయిలో తెలంగాణకు ప్రాతినిధ్యం వహించారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ హేజాజ్ తదితరులున్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన అవసరం


మాట్లాడుతున్న దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా

బహదూర్‌పురా: సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా అన్నారు. దక్షిణ మండలం పోలీసులు, షీ టీమ్స్, సైబర్ క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సెయింట్ మార్క్స్ బాయ్స్‌టౌన్ హైస్కూల్‌లో విద్యార్థులకు సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీమ్స్ ఏసీపీ ప్రసన్న లక్ష్మీ, షీ టీమ్స్ ఇన్‌స్పెక్టర్ ధనలక్ష్మీ, సైబర్ క్రైమ్ ఎస్సై శ్రీకాంత్ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ క్రైమ్‌లను వివరించారు. మహిళలు, బాలికల పట్ల సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న నేరాలపై అవగాహన కలిగి ఉండాలని..అప్పుడే వాటి బారిన పడకుండా ఉండటానికి సులభమవుతుందన్నారు. టీనేజీ బాలికలు తమ ఫొటోలను, ఇతర సమాచారాన్ని తమ ఫోన్లలో డీపీగా పెట్టుకోవద్దన్నారు. టీనేజీ బాలురు గంజాయి, ఈ-సిగరేట్స్, డ్రగ్స్ బారిన పడకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మండలం అడిషనల్ కమిషనర్ ఎం.ఎ.మాజిద్, ఫలక్‌నుమా ఏసీపీ ఎం.ఎ.జావీద్, కాలాపత్తర్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఆసిఫ్‌లతో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ షౌరెడ్డి పాల్గొన్నారు.

అభినందనలు



గోల్కొండ: బొమ్మల దేవిక చదువులోనే కాకుండా ర్యాంప్ వాక్, పెయింటింగ్‌లో కూడా రాణిస్తుంది. గోల్కొండకు చెందిన బొమ్మల శ్రీకాంత్‌చారి కూతురు గ్లేండల్ అకాడమీలో చదువుకుంటుంది. పాఠశాల వారు నిర్వహించిన వార్షిక ర్యాంప్ వాక్, పెయింటింగ్ పోటీల్లో ఆమె పాల్గొని సత్తాచాటింది. పెయింటింగ్ కాంపిటిషన్‌లో రెండవ బహుమతి, ర్యాంప్ వాక్‌లో మూడవ బహుమతి సాధించింది. ఆమెను హెడ్ టీచర్ ఆయిషా నిఖత్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అత్రియా, న్యాయ నిర్ణేత రాధా, విజయ్, జాన్, శ్రేష్ట తదితరులున్నారు.

మర్యాదపూర్వక కలయిక



చార్మినార్: ఎస్సీ వర్గీకరణకు సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని.. తమ తరపున ఆయనకు అభినందనలు తెలియజేస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ అన్నారు. కాంగ్రెస్ కమిటీ రంగారెడ్డి జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ పెంటయ్యతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు ఎస్ఎం నరసింహ స్వామి తదితరులు మందకృష్ణ మాదిగను మర్యాదపూర్వకంగా కలిసారు. తనను కొత్తగా కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లాకు ఎస్సీ కమిటీ చైర్మన్‌గా నియమించారని ఆయన మందకృష్ణ మాదిగకు వివరించారు. ఎస్సీల సంక్షేమం కోసం ఏ పార్టీలో ఉన్నా నిరంతరం కృషి చేయాలని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారన్నారు.

పాతబస్తీలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేస్తాం




చార్మినార్: పాతబస్తీలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని.. వీలును బట్టి పాతబస్తీలో సమావేశానికి రావాలని ఎమ్మెల్సీ కవితను కలిసి కోరామని బీఆర్ఎస్ పార్టీ మొగల్‌పురా ఇన్‌చార్జి పుప్పాల రాధాకృష్ణ తెలిపారు. శనివారం యూత్ నాయకులు అంబటి రాజేష్, పంకజ్ షిండే, అంబటి వినేష్ తదితరులతో ఆమెను కలిసి పార్టీ అభివృద్ధిపై తీసుకోవాల్సిన నిర్ణయాలు, చేపట్టాల్సిన చర్యలపై చర్చించినట్లు ఆయన తెలిపారు.

ప్రముఖ సంఘసేవకుడు కాడిగే పాండయ్య మృతి



గోల్కొండ: ప్రముఖ సంఘసేవకుడు, కార్వాన్ పద్మశాలి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాడిగే పాండయ్య శనివారం మృతి చెందారు. కార్వాన్ నియోజకవర్గంలో నిస్వార్థ ప్రజా సేవకుడిగా ఆయన పేరు పొందారు. దర్బార్ మైసమ్మ ఆలయ కమిటీ సభ్యుడిగా కార్వాన్‌లోని అన్నపూర్ణ ఐటీఐ వ్యవస్థాపక ఇన్‌చార్జీగా ఆయన పని చేశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం ఉదయం జాఫర్‌గూడలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. కార్వాన్ గణేష్ ఘాట్‌లోని హిందూ శ్మశానవాటికలో సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి.

యువతి అదృశ్యం


దీక్షిత

గౌలిపురా: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ యువతి కనిపించకుండా పోయిన ఘటన భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై వి.దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా సరస్వతీనగర్ ప్రాంతానికి చెందిన టి.విజయ్‌సింగ్‌కు కుమారుడు, కూతురు టి.దీక్షిత (19)లు సంతానం. కాగా శనివారం తెల్లవారుజామున 2.15 గంటల సమయంలో వాష్‌రూమ్ కోసం నిద్రలేవగా ఇంట్లో నుంచి కూతురు దీక్షిత కనిపించ లేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తండ్రి విజయ్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జీహెచ్ఎంసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


సదస్సుకు ర్యాలీగా వెళ్తున్న యూనియన్ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ఐఎన్‌టీయూసీ రాష్ట్ర స్థాయి సదస్సుకు జీహెచ్ఎంసీ మున్సిపల్ సర్కార్ మజ్దూర్ యూనియన్ నాయకులు తరలివెళ్లారు. ఈ మేరకు శనివారం జీహెచ్ఎంసీ కార్యాలయం నుంచి రవీంద్ర భారతి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.షరీఫ్ మాట్లాడుతూ..జీహెచ్ఎంసీ ఉద్యోగుల పదోన్నతులు, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం, నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించారు. అదేవిధంగా జీహెచ్ఎంసీ ఉద్యోగులకు ఇంటి స్థలాలను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.మోదూస్, ఉపాధ్యక్షుడు కే.రాజు, జోనల్ ప్రెసిడెంట్ వై.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణ అభివృద్ధి


వరలక్ష్మితో కాంగ్రెస్ నాయకులు

గోల్కొండ: కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణ అభివృద్ధి జరుగుతుందని ప్రజా పాలన విజయోత్సవ సంబరాల హైదరాబాద్ ఇన్‌చార్జి వరలక్ష్మి అన్నారు. తెలంగాణలో జరుగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన విజయోత్సవాలను పురస్కరించుకొని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు ఆమెను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధిని, సీఎం రేవంత్‌రెడ్డి పనితనాన్ని చూసి బీజేపీ, బీఆర్ఎస్‌లు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో కూడా తాము ప్రజా పాలన విజయసంబరాలు నిర్వహిస్తామని కార్వాన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కురాకుల కృష్ణ ఆమెకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, గరిగే కిషన్, గోవర్ధన్‌రెడ్డి, అల్లం భాస్కర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'కీలుగుర్రం' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకట రమణమ్మ, ఆచార్య ఎస్.గోపీ తదితరులు

గన్‌ఫౌండ్రీ: కవులు, రచయితలు సాహిత్యంతో పాటు బాల సాహిత్యాన్ని బాధ్యతగా రాస్తే రేపటి బాలలకు చక్కని సంపద అవుతుందని బాల సాహితీవేత్త కొల్లూరు స్వరాజ్యం వెంకటరమణమ్మ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో దక్కన్ సాహిత్య సభ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత ఆచార్య ఎస్.గోపీ రచించిన కీలుగుర్రం పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పిల్లల కోసం పుస్తకాలు రావాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత పత్తిపాక మోహన్, సినీనటుడు భూపాల్, ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రఘు, సాహిత్య అకాడమీ బాల పురస్కార గ్రహీత చొక్కాపు వెంకటరమణ, చిత్రకారులు కూరెళ్ల శ్రీనివాస్, పత్తిపాక ఫౌండేషన్ కన్వీనర్ గిరిపెల్లి అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



అబిడ్స్: గుడిమల్కాపూర్ సాయిబాబా త్రయంబకేశ్వర ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ నాగేందర్, స్థానిక భక్తులు పాల్గొని పూజలు చేశారు.

బర్త్ డే పార్టీలో ఘర్షణ.. ఇద్దరి అరెస్టు

జియాగూడ: అర్ధరాత్రి జరిగిన పుట్టినరోజు వేడుకల్లో గొడవ జరగగా గొడవకు కారణమైన ఇద్దరిని అరెస్ట్ చేసిన ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ భాస్కర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని సబ్జిమండి ప్రాంతంలో ఉంటున్న సతీష్ సింగ్ (27) రౌడీ షీటర్. తన పుట్టినరోజు వేడుకలకు స్నేహితులు టప్పాచబుత్రకు చెందిన మహేష్, అతిక్ మహ్మద్(32) పిలిచాడు. పార్టీలో ముగ్గురి మధ్య గొడవ జరగగా అతిక్ మహ్మద్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సతీష్ సింగ్, మాహేష్‌ను అరెస్టు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి

గౌలిపురా: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి అన్నారు. అంబికానగర్‌లో శనివారం ఆమె జీహెచ్ఎంసీ ద్వారా మంజూరైన రూ.6.10 లక్షల నిధులతో నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ..అంబికానగర్ బస్తీలో రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో జీహెచ్ఎంసీ ద్వారా మంజూరు చేయించిన నిధులతో నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఇప్పటికే డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. గౌలిపురాను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గౌలిపురా ఏఈ తేజోవంత్, బీజేపీ నాయకులు ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, జి.రఘుకాంత్, కౌడి సురేందర్, జమాల్‌పూర్ అశోక్, కె.ప్రేమ్‌రాజ్, బస్తీవాసులు కోటయ్య, డి.సీతారాం, ఎం.విలాస్ తదితరులు పాల్గొన్నారు.

టీజీఎంఎఫ్‌సీతో గ్లోబల్ కోచ్ ఐటీ అకాడమీ ఒప్పందం


మహ్మద్ ఓబేదుల్లా కొత్వాల్‌తో ఒప్పందం కుదుర్చుకుంటున్న నదీమోద్దీన్ మహ్మద్

అబిడ్స్: టీజీఎంఎఫ్‌సీ (తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్)తో గ్లోబల్ కోచ్ ఐటీ అకాడమీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. నిరుద్యోగులైన మైనార్టీ యువతకు పలు విధాల శిక్షణలు ఇచ్చేందుకు ఈ ఒప్పందం చేపట్టారు. టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ మహ్మద్ ఓబేదుల్లా కొత్వాల్‌తో గ్లోబల్ కోచ్ ఐటీ అకాడమీ సీఈఓ నదీమోద్దీన్ మహ్మద్ అవగాహన ఒప్పందం చేపట్టారు. ఈ సందర్భంగా నదీమోద్దీన్ మహ్మద్ మాట్లాడుతూ..మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొనసాగే మైనార్టీలందరికీ శిక్షణ, ఉపాధి, ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్‌లు చేపడుతామని వివరించారు. తమ గ్లోబల్ కోచ్ ఐటీ అకాడమీ ద్వారా నాణ్యమైన శిక్షణ ఇస్తామన్నారు.

ప్రత్యేక పూజలు


భాగ్యలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

చార్మినార్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన సందర్భంగా చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్, మాజీ మంత్రి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.వెంకటేష్ ముదిరాజ్, జి.దినేష్, టి.చంద్రశేఖర్, డల్లు శివ, భాను పాల్గొన్నారు.

హబీబ్‌నగర్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ కె.విజయ్ శ్రీనివాస్

నాంపల్లి: హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. శనివారం హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు ఆసిఫ్‌నగర్ ఏసీపీ కె.విజయ్ శ్రీనివాస్ హాజరై రౌడీషీటర్లకు వార్నింగ్ ఇచ్చారు. ఎలాంటి సెటిల్‌మెంట్లలో తలదూర్చవద్దని, శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్లను ఎత్తివేస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా పడిపూజ


పూజలో భక్తులు, అయ్యప్ప స్వాములు

అబిడ్స్: హరిహర పుత్ర అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో వివేకానందనగర్ కన్నిక పరమేశ్వరీ ఆలయంలో 16వ అయ్యప్ప స్వామి మహా పడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామియే శరణమయ్యప్ప అంటూ అయ్యప్ప స్వాములు భక్తి గీతాలు, శరణుఘోషతో ఆలయం ఆధ్యాత్మికంగా మారింది. దాదాపు 1000 మంది అయ్యప్ప స్వాములు ఈ మహా పడిపూజలో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న ఫిషరీష్ చైర్మన్ మెట్టు సాయికుమార్

అబిడ్స్: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రాష్ట్ర ఫిషర్‌మెన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేపట్టారు. సంవత్సర పాలన విజయవంతం అయ్యిందని, ఇందిరమ్మ రాజ్యంలోనే పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందన్నారు. గాంధీభవన్‌లో పాలాభిషేకం చేసి విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కార్వాన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా సాయిరామ్



గోల్కొండ: కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా వి.సాయిరామ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సాయిరామ్ మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పథకాలను కార్వాన్ నియోజకవర్గం నలుమూలలా అందించేందుకు కృషి చేస్తానన్నారు. అన్ని ప్రాంతాల్లో పార్టీని పటిష్టం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. తరచూ బస్తీలు, కాలనీల్లో పర్యటించి అన్ని ప్రభుత్వ శాఖల దృష్టికి ప్రజా సమస్యలు తీసుకువెళ్లి పరిష్కారం చేస్తానని సాయిరామ్ పేర్కొన్నారు. తనను ఎన్నుకున్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం కప్ క్రీడా పోటీలకు ఆహ్వానం


చంద్రశేఖర్

దూద్‌బౌలి: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా బహదూర్ పురా మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ఈనెల 10, 11, 12వ తేదీల్లో కులీకుతుబ్ షా స్టేడియంలో నిర్వహించనున్నట్లు బహదూర్‌పురా తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్, యోగా పోటీలలో కళాశాల, పాఠశాలలకు చెందిన విద్యార్థులతో పాటు స్థానిక యువకులు పాల్గొన్నవచ్చునని ఆయన వివరించారు. ఈ క్రీడా పోటీలు పదో తేదీ మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి కలిగిన వారు https.//cmcup2024.telanagana.gov.in లేదా బహదూర్‌పురా తహసీల్దార్‌ను సంప్రదించవచ్చునని..10వ తేదీన ఉదయం 10 గంటలకు కులీ కుతుబ్ షా స్టేడియంలో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ సీఎం కప్ క్రీడా పోటీలను చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ, బహదూర్‌పురా ఎమ్మెల్యే మహమ్మద్ ముబీన్ ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఈ క్రీడల్లో గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలతో పాటు జిల్లా స్థాయి క్రీడలకు అర్హత కల్పిస్తునట్లు తెలిపారు.

గోమాత గానామృతం సీడీ ఆవిష్కరణ


సీడీని ఆవిష్కరిస్తున్న శివకుమార్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: అంతర్జాతీయ గోసేవా ఇనిస్టిట్యూట్ సౌజన్యంతో శ్రీభారతి ఫౌండేషన్, శ్రీ భారతి మ్యూజిక్ అకాడమీల ఆధ్వర్యంలో ప్రముఖ దర్శకుడు నిట్టల గోపాల కృష్ణ రూపొందించిన గో మాత గానామృతం సీడీ ఆవిష్కరణ సభ శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా యుగ తులసి ఫౌండేషన్ చైర్మన్ కే.శివకుమార్, సామాజిక సేవ కార్యకర్త డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ..ఆవును జాతీయ ప్రాణిగా గుర్తించేందుకు ఉద్యమించాలన్నారు. గో సంబంధిత ఉత్పత్తులకు ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. ఆవుపై పాటలు రాసినటువంటి రచయిత, పాడినటువంటి గాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, ఫౌండేషన్ వ్యవస్థాపకులు చింతలపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684